సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 10 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.50, కనిష్టంగా రూ.24, సరాసరిన రూ.36 ప్రకారం ధర పలికింది.



ఖరీఫ్ ఆశలు గల్లంతు

తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్ పంటలన్నీ తుడిచిపెట్టుకు పోయాయి. వేరుశనగ ఎకరాకు నాలుగు బస్తాలు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. 10లో

గరిష్టం/కనిష్టం
35.7°/22.1°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా వెంకటసుబ్బయ్య



వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి(సీఈఓ)గా జి.వెంకటసుబ్బయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ సీఈఓగా కొత్తగా వచ్చిన ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలతో సీఈఓ పోస్టు కూడా కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. కడప జిల్లా డీఎల్‌డీఓగా పని చేస్తున్న వెంకటసుబ్బయ్యను ఇటీవల జరిగిన బదిలీల్లో అనంతపురం డిప్యూటీ సీఈఓగా నియమించారు. సీఈఓగా నియమితులైన నంద్యాల డ్వామా పీడీ రామ చంద్రారెడ్డి రెండున్నర నెలలు సెలవు పెట్టి అమెరికా వెళ్లారు. దీంతో ఆ పదవి కూడా డిప్యూటీ సీఈఓగా అప్పగించారు.

- ఇటీవలి వరకూ ఇన్‌చార్జ్ సీఈఓగా పని చేసిన చిలంకూరు ఓబుళమ్మను వైఎస్సార్ జిల్లా సీఈఓగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె అక్కడకు వెళ్లేందుకు సుముఖంగా లేరు. అనంతపురం జిల్లాలోనే ఏదో ఒక శాఖకు పోస్టింగ్ తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈగా సురేంద్ర



ఎస్ఈ సురేంద్ర

పుట్టపర్తి టౌన్: జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా ఎం.సురేంద్రను నియమిస్తూ ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి జనరల్ మేనేజర్ సంతోష్‌రావ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భావం తర్వాత కూడా ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే విద్యుత్‌శాఖ కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. తాజాగా జిల్లా కేంద్రం పుట్టపర్తి పేరుతో నూతన సర్కిల్ ఏర్పాటు చేశారు. గతంలో అనంతపురం ఎస్ఈగా పని చేసి ప్రస్తుతం తిరుపతి కార్పొరేట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న సురేంద్రను ఇక్కడ ఎస్ఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

'పీఎం యశస్వి'కి దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి టౌన్: తొమ్మిది, పది, ఇంటర్ చదువుతున్న బీసీ, ఈబీసీ వర్గాలు, సంచార జాతులకు చెందిన విద్యార్థులు పీఎం యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి నిర్మలాజ్యోతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 15వ తేదీలోపు, ఇంటర్ విద్యార్థులు అక్టోబర్ 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించకూడదన్నారు. పూర్తి వివరాలకు www. scholarships. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.



సరస్వతిదేవి అలంకారంలో ఖాద్రీశుడు



సరస్వతీదేవిగా ధర్మవరం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోని అమ్మవారు



సరస్వతీదేవి అలంకరణలో లేపాక్షిలోని దుర్గాదేవి

సరస్వతీ నమస్తుభ్యం

దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తుతున్నాయి. బుధవారం వివిధ ఆలయాల్లో జగన్మాత వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. చాలాచోట్ల సరస్వతీమాత అలంకారంలో కనిపించారు. దసరా ఉత్సవాల సందర్భంగా కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనారసింహుడు కూడా బుధవారం రాత్రి చదువుల తల్లి సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

– సాక్షి బృందం, శ్రీసత్యసాయి జిల్లా

గోకులం.. పచ్చ పెత్తనం



రైతులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక పశువుల షెడ్డు

పశువుల సంఖ్య	షెడ్డు యూనిట్ విలువ	రాయితీ
2 పశువులు	రూ.1,15,000	రూ.1,03,500
4 పశువులు	రూ.1,85,000	రూ.1,66,500
6 కన్నా ఎక్కువ	రూ.2,30,000	రూ.2,07,000
20 గొర్రెలు, మేకలు	రూ.1,30,000	రూ.91,000
50 గొర్రెలు, మేకలు	రూ.2,30,000	రూ.1,61,000
100 కోళ్లు	రూ.87,000	రూ.60,900
200 కోళ్లు	రూ.1,32,000	రూ.92,400

- జిల్లాకు 1,325 గోకులాలు మంజూరు
- ఇప్పటి వరకూ రైతుల నుంచి 2,800 దరఖాస్తులు
- అన్నీ తమ వారికే మంజూరు చేయాలంటున్న పచ్చ నేతలు
- ఎంపీడీఓలు, పశువైద్యులు, ఏపీఓలపై తీవ్ర ఒత్తిళ్లు

పుట్టపర్తి అర్బన్: పశుపోషణపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతుల కోసం ప్రవేశపెట్టిన 'మినీ గోకులం' పథకంపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. పశువులకు నీడనిచ్చే పథకంపైనా రాజకీయం చేస్తున్నారు. జిల్లాకు మంజూరైన మినీ గోకులాల్లో 90 శాతం తమకే కావాలంటూ పట్టుబట్టారు. ఈ మేరకు ఎంపీడీఓలు, పశువైద్యులు, ఉపాధి హామీ పథకం ఏపీఓలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తమకు అనుకూలమైన వారితోనే దరఖాస్తులు చేయిస్తున్నారు. కాగా, జిల్లాలో చాలామంది ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉండడంతో వారికి ఒకటి, రెండు ఇచ్చి మిగిలిన మినీ గోకులాలన్నీ కూటమి పార్టీల కార్యకర్తలకు దక్కేలా ప్లాన్ చేశారు. ముందస్తుగా అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

జిల్లాకు 1,325 మంజూరు..

జిల్లాకు 1,325 మినీ గోకులం యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో గత ప్రభుత్వం ఎంపిక చేసిన కరువు మండలాల్లో ఒక్కో మండలానికి 45, తక్కిన మండలాల్లో ఒక్కో మండలానికి 35 చొప్పున మంజూరు చేయనున్నారు. మినీ గోకులాలకు రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకూ మూడు సైజుల్లో షెడ్లు నిర్మిస్తారు. ఈ షెడ్ల నిర్మాణం కోసం రైతు వాటాగా 10 శాతం చెల్లించాల్సి ఉన్నా...ఆ నిధులను ఉపాధి హామీ పథకం నుంచి చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులు ఎవరంటే..

మినీ గోకులాలకు ఎస్సీ, ఎస్టీ, వలస, ఇతర తెగల రైతులు అర్హులు. వీరితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, మహిళలు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుంది. అర్హులు దరఖాస్తు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం తదితరాలను జత చేసి సంబంధిత ఎంపీడీఓలకు అందజేయాలి. పశువైద్యులు గ్రామానికి వచ్చి రైతుకు పశువులు ఉన్నాయా లేదా అని పరిశీలిస్తారు. ఉపాధి హామీ ఏపీఓలు షెడ్డు నిర్మాణానికి అనువైన స్థలం, రైతు అర్హతలను పరిశీలించి ఆన్‌లైన్ చేస్తారు. అనంతరం రైతులకు షెడ్లు నిర్మిస్తారు.

పెరిగిన పాడి సంపద..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వరాలు విస్తారంగా కురిశాయి. 'జగనన్న పాల వెల్లువ'పథకం కింద అమూల్ డెయిరీ కార్యకలాపాలు జిల్లాలో విస్తరించారు. ఫలితంగా పాడిరైతులకు ఎంతో మేలు జరిగింది. పాలకు కూడా అధిక ధర అందించారు. దీంతో రైతులు పెద్దఎత్తున పాడి ఆవులు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ప్రభుత్వం మినీ గోకులాలకు దరఖాస్తులు ఆహ్వానించగా, భారీగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ కొందరు టీడీపీ నేతలు గ్రామాల్లో పచ్చ రాజకీయం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పథకానికి 2,800 దరఖాస్తులు అందినట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

అర్హులందరికీ అందజేయాలి



జిల్లాలో పశు సంపద బాగా పెరిగింది. చాలా మంది రైతులకు కళ్లాలు కూడా లేక రోడ్లపైనే ఆవులను కట్టేస్తున్నారు. మినీ గోకులం ఇస్తే పశువులను సంరక్షించుకునే అవకాశం ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ మినీ గోకులాలు మంజూరు చేయాలి. అప్పట్లో వైఎస్ జగన్ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారు.

– లక్ష్మీపతి, సుబ్బరాయనిపల్లి

నిబంధనల మేరకే మంజూరు



నిబంధనల మేరకు అర్హులైన రైతులకు మినీ గోకులాలు మంజూరు చేస్తాం. పాడి ఆవులతో పాటు, గొర్రెలు, మేకలు, కోళ్లకు సైతం షెడ్లు మంజూరు చేస్తాం. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఈ పథకం ఉన్న నాలుగేళ్లు యూనిట్లు మంజూరు చేస్తాం. ఒక్కో రైతుకు ఒక్కసారి మాత్రమే ఈ యూనిట్ మంజూరు చేస్తాం.

– శుభదాస్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

అర్హులకే యూనిట్లు



ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అర్హతలూ ఉన్న చిన్న, సన్న కారు రైతులకే యూనిట్ మంజూరు చేస్తాం. లబ్ధిదారుకు ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండాలి. అనువైన స్థలం, పశువులు ఉండాలి. ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తాం. షెడ్డు నిర్మాణంలో ప్రతి దశలోనూ ఫొటోలు తీసి జియోట్యాగింగ్ చేస్తాం.

– విజయప్రసాద్, పీడీ, డ్వామా

టెండర్ మనకే దక్కాలి!

"మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసే వారంతా మంచి ముహూర్తం చూడాలంటూ ఇంటి దగ్గర క్యూ కడుతున్నారు. జాతకాలు ఒకటికి పదిసార్లు చూడాల్సి వస్తోంది. కొందరైతే ఇంట్లో వారందరి పేర్ల బలాబలాల గురించి అడుగుతున్నారు. మూడు రోజులుగా ఆలయం వద్దకు కూడా వెళ్లలేని పరిస్థితి"

– ఈ మధ్య కనిపించడం లేదు. ఎక్కడికి వెళ్లారని అడగ్గా కొత్తచెరువుకు చెందిన ఓ పురోహితుడు ఇచ్చిన సమాధానమిది.



జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్లు	8
ఏర్పాటు కానున్న మద్యం షాపులు	87
9వ తేదీ నాటికి అందిన దరఖాస్తులు	905

దరఖాస్తు గడువు 11వ తేదీ (సాయంత్రం 7 గంటల వరకు)

మంచి ముహూర్తం చూడండి

- మద్యం టెండర్లపై ఆశావహుల సెంటిమెంట్
- ముహూర్తం కోసం పురోహితుల ఇళ్ల వద్దకు క్యూ
- 9ని లక్కీ నంబర్‌గా భావించి 9వ తేదీ బుధవారం భారీగా దరఖాస్తుల సమర్పణ
- మద్యం టెండర్లతో జ్యోతిష్యులకూ పెరిగిన డిమాండ్
- గడువు పొడిగించడంతో బరిలోకి మరికొందరు

సాక్షి, పుట్టపర్తి

మద్యం దుకాణాలకు దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా ఉండటంతో చాలామంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. స్థానికంగా ఉన్న పురోహితులు, జ్యోతిష్యుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఏ రోజున దరఖాస్తు చేస్తే మంచిది.. ఎవరి పేరుతో వ్యాపార రంగంలో దిగితే బాగుంటుంది.. ఎన్ని గంటలకు దరఖాస్తు సమర్పించాలి.. ఇలా పలు కోణాల్లో ఆరా తీస్తున్నారు.

9ని లక్కీ నంబర్‌గా భావించి...

దరఖాస్తు గడువుకు ప్రభుత్వం ముందుగా ఈనెల 9వ తేదీ గడువు విధించింది. దీంతో చాలా మంది 9 నంబర్‌ను లక్కీగా భావించి బుధవారమే దరఖాస్తులు సమర్పించారు. అందువల్లే జిలాల్లోని 87 షాపులకు మంగళవారం నాటికి 454 దరఖాస్తులు అందగా... బుధవారం ఒక్కరోజే 451 దరఖాస్తులు దాఖలయ్యాయి. దీంతో బుధవారం నాటికి జిల్లాలోని అన్ని దుకాణాలకు మొత్తంగా 905 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వం దరఖాస్తు గడువు మరో రెండు రోజులు (ఈనెల 11వ తేదీ వరకు) పొడిగించడంతో ఔత్సాహికులు మరోసారి పురోహితులను ఆశ్రయిస్తున్నారు. 10 నెల 10వ తేదీ 10 గంటలకు దరఖాస్తు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. మరోవైపు చివరి రోజు శుక్రవారం కావడంతో దరఖాస్తుల సంఖ్య ఆశాజనకంగా ఉంటుందని అందరూ అంచనా వేస్తున్నారు.

ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు..

మద్యం షాపులకోసం దరఖాస్తు చేసేందుకు సిద్ధమైన వారంతా ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఎన్నడూ దేవుడికి మొక్కని వారు కూడా... మూడు రోజులుగా 'టెంపుల్ రన్' చేయడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. మరికొందరైతే 'స్వామీ షాపు దక్కేలా చూడు...నీవద్దకు నడిచొస్తా.. అంటూ భారీగా మొక్కులు మొక్కుతున్నారు.

టెండరు పూర్తికాకుండానే స్థల పరిశీలన..

టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. కానీ కొందరు మాత్రం ముందుగానే దుకాణం నిర్వహించుకునేందుకు స్థల పరిశీలన చేస్తున్నారు. టీడీపీ నేతల కనుసన్నల్లోనే మద్యం దుకాణాల టెండర్లు నడుస్తున్న నేపథ్యంలో ముఖ్యనేత అనుగ్రహం ఉన్న వారంతా సింగిల్ టెండర్‌కు సిద్ధమయ్యారు. ఎవరినీ దరఖాస్తు చేయనీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ క్రమంలోనే ఎలాగూ తమకే దుకాణం వస్తుందని భావించి ముందుగానే షాపు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్నారు. షాపు ఎక్కడ బాగుంటుంది.. ఏ దిక్కున తలుపు ఉంటే కలిసి వస్తుందన్న దానిపై ప్రధాన కూడళ్లలోని భవనాలను పరిశీలిస్తుండటం గమనార్హం.

ప్రతి పంటా నమోదు కావాలి



జగరాజుపల్లి లో మామిడి తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్, అధికారులు

- ఈ–క్రాప్ బుకింగ్‌ను సూపర్ చెక్ చేసిన కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు నష్టపోకుండా పరిహారం అందించేందుకు రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ నమోదు చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పంట నమోదు కార్యక్రమం(ఈ–క్రాప్ బుకింగ్)ను సూపర్ చెక్ చేశారు. తన లాగిన్‌కు వచ్చిన 142 మంది రైతులకు చెందిన పంటల వివరాలను క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బుధవారం కలెక్టర్ చేతన్ జగరాజుపల్లి, బీడుపల్లి, ఎనుములపల్లి, పుట్టపర్తి గ్రామాలకు చెందిన రైతు పొలాలను సందర్శించారు. అధికారులు నమోదు చేసిన వివరాలు క్షేత్రస్థాయిలో కనిపించిన పంట, విస్తీర్ణం సరిగా ఉందా, లేదా అని పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి ఈ–క్రాప్ బుకింగ్ నమోదు తీరు గురించి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సువర్ణ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏడీఏ స్వయం ప్రభ, తహసీల్దార్ అనుపమ, ఏఓ వెంకటబ్రహ్మం తదితరులు ఉన్నారు.

మరో రెండు రోజులు చాన్స్

- మద్యం దుకాణాల దరఖాస్తుకు గడువు పెంచిన ప్రభుత్వం

పుట్టపర్తి టౌన్: మద్యం దుకాణాల దరఖాస్తుకు ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పొడిగించింది. తొలుత నిర్ణయించిన మేరకు ఈనెల 9వ తేదీ బుధవారం సాయంత్రానికి గడువు ముగిసింది. అయితే వివిధ కారణాలతో మరో రెండు రోజులు గడువు పొడిగించిన ప్రభుత్వం ఈనెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు అవకాశం కల్పించినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నాటికి జిల్లాలోని 87 దుకాణాలకు 940 దరఖాస్తులు అందినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈనెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకూ దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 14వ తేదీ (సోమవారం) కలెక్టర్ సమక్షంలో పుట్టపర్తి సాయిరామంలో లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తామన్నారు. 15వ తేదీ పాత ఎక్సైజ్ పాలసీ రద్దు చేసి 16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేస్తామని పేర్కొన్నారు.

అన్నింటా అరాచకం



- అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉమ్మడి జిల్లా
- అల్లుకుపోయిన మట్కా మహమ్మారి
- కమ్ముకున్న గంజాయి పొగలు
- గ్రామాల్లో అధికారికంగా పేకాట స్థావరాలు
- కొత్త మద్యం పాలసీతో కిక్కు పెంచిన సర్కారు
- భారీగా పెరిగిన దొంగతనాలు, ఏటీఎంల లూటీలు
- అడ్డూ అదుపు లేని బెట్టింగ్ ముఠాలు
- వ్యసనాలతో చిత్తవుతోన్న యువత



ఇటీవల పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన తాడిపత్రి పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పుణ్యమా అని ఉమ్మడి అనంతపురం బ్రాండ్ ఇమేజ్ మారిపోయింది. ఇన్నాళ్లూ వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ఉద్యాన పంటలకు ప్రసిద్ధిగాంచిందని, ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రా అని చెప్పుకునే జిల్లా.. నేడు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిపోయింది.ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మట్కా మహమ్మారి జడలు విప్పింది. గంజాయి పొగలు కారుమబ్బుల్లా కమ్ముకున్నాయి. బెట్టింగ్ వ్యసనం కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. పేకాట విచ్చలవిడిగా సాగుతున్నా అడిగే దిక్కులేదు.తాజా పరిస్థితుల్లో అనంతపురం జిల్లా రకరకాల జూదాలతో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఎక్కడ చూసినా మట్కా..

ఒకప్పుడు తాడిపత్రికే పరిమితమైన మట్కా ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. బంగారానికి ప్రొద్దుటూరు ఎలా ప్రాచుర్యమో అలా నేడు అనంతపురం జిల్లా మట్కాకు పేరుగాంచింది. అనంతపురం నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మట్కా భారీగా నడుస్తున్నట్టు తేలింది. రమారమి 42 మంది ఏజెంట్లు పోలీసుల కనుసన్నల్లోనే రోజూ మట్కా నడిపిస్తున్నట్టు సమాచారం. నెలవారీ మామూళ్లు అందుతుండటంతో పోలీసులు ఏమీ అనడం లేదు. రాయదుర్గం, కళ్యాణ దుర్గం, గుంతకల్లు, ధర్మవరం నియోజకవర్గాల్లో మట్కా రాసే ఏజెంట్లు ఎక్కువయ్యారు. వీళ్లందరూ పోలీసులతో సఖ్యతగా మెలుగుతూ వ్యవహారం నడిపిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గం'జాయ్'..

గతంలో ఎన్నడూ లేని రీతిలో ఉమ్మడి జిల్లాలో గంజాయి లభిస్తున్నట్టు తేలింది. ఇటీవల స్వయంగా టీడీపీ నాయకుడు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డే గంజాయికి అడ్డూ అదుపూ లేదని వ్యాఖ్యానించారంటే పరిస్థితి అంచనా వేయొచ్చు. ఇటీవల రాయదుర్గంలో 12 కేజీల గంజాయి లభించింది. అనంతపురం నగరంలో ప్రతి చోటా గంజాయికి బానిసలైన యువత కనిపిస్తున్నారు. రాత్రి పూట హైవేల్లోని ధాబాల్లో హుక్కా, గంజాయి పీలుస్తున్న యువత బాగా కనిపిస్తున్నట్లు వెల్లడైంది. దీనికితోడు దొంగతనాలు, ఏటీఎంల లూటీలు కూడా భారీగా పెరిగిపోయాయి.

కొత్త పాలసీతో మద్యం కిక్కు..

గతంలో బహిరంగ మద్యపానంపై నిషేధం ఉండేది. అయితే, కూటమి సర్కారు ఈ విషయాన్ని గాలికొదిలింది. జిల్లా వ్యాప్తంగా ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో అనధికారికంగా మద్యం సేవించే వెసులుబాటు కల్పించారు. మద్యం తాగిస్తున్నందుకు ఆయా హోటళ్ల నిర్వాహకులు సివిల్ పోలీసులకు కప్పం కడుతున్నారు. ఇక ఈనెల 16వ తేదీ నుంచి కొత్త మద్యం షాపులు రానుండటంతో మత్తు మరింత పెరగనుంది. కర్ణాటక నుంచి వచ్చే మద్యం కూడా బాగా పెరిగినట్టు పోలీసుల పరిశీలనలో వెల్లడైంది.

పేకాట, బెట్టింగ్ ముఠాల దూకుడు

2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలొచ్చాయి. జూన్ 12న కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ రోజునుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేకాట, బెట్టింగ్ ముఠాల దూకుడు పెరిగింది. స్వయానా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశ‌ సొంతూరు కొకుంట్లలోనే టీడీపీ మండలస్థాయి నేత పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు తేలింది. ఎక్కడికక్కడ అధికారికంగానే ఎమ్మెల్యేల అండతో పోలీసులే పేకాట నడిపిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ ముఠాలు స్వైరవిహారం చేస్తున్నాయి. సైబర్ నేరాలు పెరిగాయి. ఈ క్రమంలో రకరకాల వ్యసనాలు, జూదం తదితర వాటిలో ఉమ్మడి అనంతపురం జిల్లా అన్నిటికంటే ముందంజలో ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

అన్ని కేసులపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: అన్ని రకాల కేసులపై అవగాహన కలిగి ఉండాలని డీసీఆర్‌బీ సిబ్బందికి ఎస్పీ రత్న సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం డీసీఆర్‌బీ సిబ్బందితో ఆమె సమావేశమై మాట్లాడారు. తీవ్ర నేరాలు, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ కేసులు, లోకాయుక్త, రౌడీషీటర్లు, చోరీలు తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ శాఖలో డీసీఆర్‌బీ అనేది చాలా కీలకమన్నారు. నేరాలపై అవగాహన కలిగి ఉంటూ ఎప్పటికప్పుడు ఆయా స్టేషన్లకు ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా నేర నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరు సమష్టిగా టీం వర్క్ పనిచేయడం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించవచ్చన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఐటీ కోర్ టీం సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లో పడి రైతు మృతి


మృతుడు నాగరాజు

గుత్తిరూరల్: మండలంలోని బేతాపల్లికి చెందిన రైతు బోయ నాగరాజు ప్రమాదవశాత్తు చెక్ డ్యామ్‌లో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నాగరాజు (40) బుధవారం ఉదయం తన పొలానికి వెళుతూ మార్గం మధ్యలో ప్రమాదవశాత్తు కాలుజారి చెక్ డ్యామ్‌లో పడ్డాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగిపోయాడు. విషయాన్ని గుర్తించిన సమీప పొలాల్లోని రైతులు వెంటనే చెక్‌డ్యామ్‌లో దూకి గాలింపు చేపట్టి అపస్మారక స్థితికి చేరుకున్న నాగరాజును వెలికి తీసి, వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చిరుత దాడిలో దూడ మృతి


గేదె దూడ కళేబరం

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో గేదె దూడపై చిరుత దాడి చేసింది. రైతు వెంకటేశులు తోటలో బుధవారం తెల్లవారుజామున ప్రవేశించిన ఓ చిరుత పశువుల మందలోని 11 నెలల గేదె దూడను అక్కడి నుంచి లాక్కెళ్లింది. గమనించిన రైతు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. తోటకు సుదూరంగా దూడను లాక్కెళ్లి చంపి సగానికి పైగా తినేసింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారి తిమ్మక్క, పశువైద్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పంచనామా అనంతరం దూడ కళేబరాన్ని ఖననం చేశారు.

13న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిన్నరాసి చంద్రమౌళి రెడ్డి, కార్యదర్శి కిషోర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతినెలా రెండో ఆదివారం ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేట బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుకవైపు సంఘం కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు బయోడేటా తీసుకొని రావాలని కోరారు. ఈ చక్కటి అవకాశాన్ని రెడ్డి కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 94415 15646, 93902 84295, 94907 67224 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఖరీఫ్ ఆశలు గల్లంతు

- ఎకరాకు 4 బస్తాలకు మించని వేరుశనగ దిగుబడి
- దారుణంగా దెబ్బతీసిన వర్షాభావం


వేరుశనగ పంట తొలగించి పొలంలోనే వదిలేసిన దృశ్యం

హిందూపురం అర్బన్: ఖరీఫ్‌పై రైతుల ఆశలు గల్లంతయ్యాయి. మరో వైపు సకాలంలో విత్తన పంపిణీ జరగక రబీపై కూడా ఆశలు సన్నగిల్లుతున్నాయి. జిల్లాలో నాలుగేళ్ల తర్వాత మళ్లీ కరువు ఛాయలు నెలకొన్నాయి. నీటి సమస్య కూడా జటిలమయ్యేలా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే భూగర్భజలాలు కూడా అడుగంటేలా ఉన్నాయి. ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో రైతులకు కడగండ్లు తప్పవనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

1.50 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు..

జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3,93,252 ఎకరాలు కాగా, 3,53,359 ఎకరాల్లో వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో 1.50 లక్షల ఎకరాల్లో 1,35,895 మంది రైతులు వేరుశనగ సాగు చేశారు. విత్తు మొదలు కలుపు తీతలు, పురుగు నివారణ మందులు, ఎరువులు ఇతరత్రాలు కలుపుకుని ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడులను రైతులు పెట్టారు. కలుపు తీత వరకూ పంటల పరిస్థితి బాగున్నా... ఆ తర్వాత ఊడలు దిగే సమయంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎకరాకు 4 బస్తాలకు మించి దిగుబడి లేకుండా పోయింది. మార్కెట్‌లో బస్తా వేరుశనగ రూ.3 వేల ధర పలుకుతోంది. ఈ లెక్కన 4 బస్తాలకు రూ.12 వేలు వచ్చినా రూ.3వేల నష్టం తప్పడం లేదు. దీనికి పంట తొలగింపు సమయంలో కూలీల ఖర్చు అదనంగా తోడవుతోంది.

రైతు భరోసాతో నాడు ఆదుకున్న జగన్..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. ఖరీఫ్ పంట కాలం ఆరంభానికి ముందే పెట్టుబడి సాయం కింద ఏటా క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లోకి రూ.13,500ను జమ చేస్తూ వచ్చారు. 2024 ఎన్నికల సమయంలో రైతులకు భారీ వరాలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి సర్కార్ ఆ తర్వాత అన్నదాతలను నట్టేటా ముంచింది. ఎన్నికల హామీల్లో ప్రకటించిన రూ.20 వేల ఆర్థిక సాయంపై ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనం.

పంట కోత ప్రయోగాల్లో తేలుతున్న లెక్కలు

జిల్లాలోని హిందూపురం, మడకశిర వ్యవసాయ సబ్‌డివిజన్లలో చేపట్టిన ఖరీఫ్ పంట కోత ప్రయోగాల్లో ఎకరాకు 3 నుంచి 4 బస్తాలకు మించి వేరుశనగ దిగుబడి ఎక్కడేగాని కనిపించలేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కదిరి, ధర్మవరం సబ్ డివిజన్ల పరిధిలో ప్రధాన వేరుశనగ పంటలో సగానికి పైగా దిగబడులు దక్కలేదు. గతంలో జిల్లాలో ప్రతి రైతు తనకున్న పొలంలో వేరుశనగ సాగు చేసేవాడు. అయితే ఏటా నష్టాలు వస్తుండటంతో ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, కంది ఇతర పంటలు సాగు చేస్తూ వస్తున్నారు. దీంతో వేరుశనగ సాగు జిల్లాలో 60 వేల హెక్టార్లకే పరిమితమైంది. ఈ ఏడాది కూడా వర్షాలు లేక నష్టాలే మిగిలాయి.

బీమా దక్కని పరిస్థితి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమాతో రైతులను అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆదుకున్నారు. నయా పైసా రైతులు చెల్లించకపోయినా... పంట నష్టపోయిన ప్రతిసారీ బీమా పరిహారం ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ–క్రాప్ బుకింగ్‌తో పాటు ఈ–కేవైసీ నమోదు ప్రక్రియను పక్కాగా చేపడుతూ వచ్చారు. దీంతో పంట నష్టపోయినా రైతులకు ఆర్థిక భారం ఉండేది కాదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పంటల బీమా పరిస్థితి ప్రశ్నార్థకమైంది. ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ ప్రక్రియ నత్తనడకన సాగుతూ వచ్చాయి. దీంతో ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులు బీమా పరిహారంపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది.

నష్ట పరిహారం ఇవ్వాలి



నాకున్న నాలుగు ఎకరాల భూమిలో ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేశాను. పంట మొదట్లో ఆశాజనకంగా ఉన్నా... తర్వాత వర్షాలు లేక దెబ్బతింది. దీంతో ఎకరాకు 3 బస్తాలు కూడా రాలేదు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి. – చౌడమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం.

ఔటన్ లేదు



వర్షాధారంపై సాగు చేస్తున్న వేరుశనగ పంటలో ఈ ఏడాది ఔటన్ శాతం చాలా తక్కువగా ఉంది. పంట ముఖ్య దశలో వర్షాలు కురిసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. బాగా ఎండిన కాయల 43 కిలోల బస్తా రూ.3,100 కొనుగోలు చేస్తున్నాం. – ఫకృద్దీన్, వ్యాపారి, చిలమత్తూరు

30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలి

- వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి


సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌టీఏ నాయకులు

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశలను కూటమి ప్రభుత్వం అడియాశలు చేస్తోందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి ధ్వజమెత్తారు. పుట్టపర్తిలోని ఎమ్మార్సీలో బుధవారం ఉపాధ్యాయులు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 27 శాతం ఐఆర్ ప్రకటించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఐఆర్ ప్రకటించక పోవడం బాధాకరమన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని వేసవి సెలవుల్లో ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలన్నారు. ఎంటీఎస్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలను ప్రతి నెలా మొదటి వారంలోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్ వేసి ఉపాధ్యాయులకు డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను కలుపుకుని ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, రాజగోపాల్, సుబ్బారెడ్డి, ప్రభాకరరెడ్డి, రామమోహన్‌రెడ్డి, కిష్టప్ప, రామాంజనేయులు, చిన్నాగప్ప, శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణప్ప, శంకరప్ప, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పని ఇన్‌చార్జ్‌ల పాలన

- ఉమ్మడి జిల్లాలో 17 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలే దిక్కు
- ఉత్తర్వులు జారీ చేసిన జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని మండల పరిషత్‌లకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేక ఇన్‌చార్జ్‌లను కొనసాగించాల్సి వస్తోంది. 63 మండలాలకు గాను 18 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేరు. దీంతో శ్రీసత్యసాయి జిల్లాలో 11 మండలాలు, అనంతపురం జిల్లాలో ఆరు మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలను నియమించారు. ఆయా మండల కార్యాలయాల్లో పని చేసే పరిపాలనాధికారులు(ఏఓలు), ఈఓఆర్డీలకు ఎఫ్ఏసీ ఇచ్చి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా నియమించారు. నాలుగు మండలాల(కంబదూరు, బొమ్మనహాళ్, వజ్రకరూరు, నల్లమాడ)కు మాత్రం పక్క మండలాల ఎంపీడీఓలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అనుమతితో జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.


పేరు	హోదా	ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా..
కె.రామానాయక్	ఏఓ, తలుపుల	తలుపుల
పి.రెడ్డెప్ప	ఏఓ, తనకల్లు	తనకల్లు
జి.గంగాధర్	ఏఓ, గుడిబండ	గుడిబండ
కె.ఓ.శ్రీధర్‌రావు	ఈఓఆర్డీ, పరిగి	పరిగి
ఎల్.రామ్‌కుమార్	ఏఓ, రొద్దం	రొద్దం
ఎ.జి.నటరాజ్	ఈఓఆర్డీ, కొత్తచెరువు	కొత్తచెరువు
ఎస్.అనిల్‌కుమార్	ఈఓఆర్డీ, కనగానపల్లి	కనగానపల్లి
డి.రాబర్ట్ విల్సన్	ఎంపీడీఓ, ఓబుళదేవరచెరువు	నల్లమాడ
ఎ.వి.రమణమూర్తి	ఏఓ, చిలమత్తూరు	చిలమత్తూరు
జి.అంజినప్ప	ఈఓఆర్డీ, నంబులపూలకుంట	నంబులపూలకుంట

కాలుష్యంతో వాతావరణంలో పెను మార్పులు


సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: కాలుష్యం కారణంగా వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని, జీవ వైవిధ్యం, మొక్కల సంరక్షణ, పెంపుదలే ఇందుకు శాశ్వత పరిష్కామని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) విశ్రాంత ప్రొఫెసర్ ఎన్‌హెచ్ .రవీంద్రనాథ్ అన్నారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పది గ్రామాల్లో క్లెమైట్ రిజిలెంట్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీఆర్‌వీడీపీ)ని అమలు చేయాలని తలపెట్టారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా నిపుణులతో కసరత్తు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా బుధ, గురువారాల్లో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో సదస్సు చేపట్టారు. ఈ సదస్సుకు ప్రారంభోన్యాసం ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి చేయగా, అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎన్‌హెచ్ రవీంద్రనాథ్ మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, పంటల సరళి తదితర అంశాలను అధ్యయనం చేశామన్నారు. కర్బన ఉద్గారాలు, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని పది మండలాల్లో 45 శాతం వర్షపాతంలో ఏటా వ్యత్యాసం ఉందన్నారు. తీవ్రమైన వర్షాభావం ఏర్పడి పంటలపై ప్రభావం పడుతోందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్కే ప్రిన్సిపల్ సైంటిస్ట్ విజయశంకర్ బాబు, బండి వెంకటేశ్వర్లు, సీకే గంగూలి, భక్తర్ వలి, మురళీకృష్ణ, మీడియా కోఆర్డినేటర్ ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం


అలంకరణలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరుడు


ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆశ్వయుజ మాస శుద్ధ షష్టి సందర్భంగా ఆలయంలో పూజలు చేపట్టారు. తొలుత శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాలతో సుబ్రహ్మణ్యేశ్వరుడికి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

గుంతకల్లు: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి బంగారుసొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. స్థానిక రైల్వే జంక్షన్‌లోని జీఆర్పీ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన సింగంరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తరచూగా రైళ్లలో ప్రయాణిస్తూ నిద్రలో ఉన్న ప్రయాణికుల బ్యాగులను అపహరించడం, కిటికీ వద్ద కూర్చొన్న మహిళల మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లడం వంటి చోరీలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా రైల్వే పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు జీఆర్పీ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులు వెలుగు చూశాయి. నిందితుడిని అరెస్ట్ చేసి, 60 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.

పని ప్రాంతంలో ఉపాధి కూలీ మృతి


మృతురాలు మస్తాన్‌బీ

ఎన్పీకుంట: పని ప్రాంతంలో ఓ ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన ఎన్పీకుంట మండలం గొకనపేట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... గొకనపేట గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీ (60) ఉపాధి పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఓ రైతు మెట్ట పొలంలో ఉద్యాన పనుల్లో భాగంగా గుంతలు తీసే పనికి వెళ్లిన ఆమె ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన తోటి కూలీలు వెంటనే ఆమెను కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ఆమె మృతికి కారణం తెలియాల్సి ఉంది.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత బుధవారం విడుదల చేశారు. మొత్తం 8,551 మంది పరీక్ష రాయగా, 3,392 మంది ఉత్తీర్ణత (39.67 శాతం) చెందారు. బీఏ (ఆనర్స్)లో 461 మందికి గాను 108 మంది, బీబీఏ (ఆనర్స్)లో 818 మందికి గాను 353 మంది, బీసీఏ (ఆనర్స్)లో 174 మందికి గాను 62 మంది, బీసీఎం (మేథ్స్, కంప్యూటర్స్) (ఆనర్స్) లో 4,512 మందికి గాను 1,635 మంది, బీఎస్సీ (ఆనర్స్)లో 2,586 మందికి గాను 1,234 మంది ఉత్తీర్ణత చెందారు. ఫలితాలు గురువారం నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో పేపర్‌కు రూ.500లు చెల్లించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకట నాయుడు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈ. రమేష్ బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. శంకర్, సూపరింటెండెంట్ మారుతి తదితరులు పాల్గొన్నారు. కాగా, మెగా సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనిత పరిశీలించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పావగడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని మురారాయనహళ్లిలో మంగళవారం జరిగిన మాళప్ప(55) హత్య కేసులో నిందితుడు బుడ్డయ్యను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ సురేష్ తెలిపిన మేరకు... మాళప్ప పదేళ్ల క్రితం తన భార్య ఈశ్వరమ్మను హత్య చేశాడు. నేరారోపణ రుజువు కావడంతో ఆయనకు పదేళ్ల జైలు శిక్ష పడింది. 3 నెలల క్రితం విడుదలై స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం బుడ్డయ్య భార్యను మాళప్ప అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో కక్ష పెంచుకున్న బుడ్డయ్య... మాళప్పపై కర్రతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమై పొలంలోనే మృతి చెందాడు. నిందితుడు బుడ్డయ్యను న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బాలుర క్రికెట్ 'అనంత' జట్టు ఎంపిక

అనంతపురం: నరసరావు పేటలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–14 బాలుర క్రికెట్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే అనంతపురం జిల్లా జట్టును జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపిక చేశారు. జట్టులో చోటు దక్కించుకున్న వారిలో టి.కిరణ్‌కుమార్ (కెప్టెన్), కె.అశ్విన్ ఆచారి (వైస్ కెప్టెన్), సి.గోకుల్, ఆర్.ఆదినారాయణ రెడ్డి, ఎ.హేమచంద్రా నాయక్, ఈ.రోహిత్, పంకజ్ మీనా, పి.భువన్‌రెడ్డి, ఎస్.కార్తీక్, హేమంత్‌కుమార్, ఎన్.ప్రాణధీర్, వై.లిఖిత్, యు.దేవస్కంధ, వెంకటసాయి, ఎం.దేవాన్ష్ రోహిత్, ఉత్తేజ్ యాదవ్ ఉన్నారు. కోచ్‌గా ఆర్.కుమార్‌ను ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా


పతకాలు సాధించిన అనంతపురం జిల్లా క్రీడాకారులు

అనంతపురం: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన అండర్–14, 17 విభాగాల్లో స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. 38 కేజీల విభాగంలో కె.త్రిషణ, 45 కేజీల విభాగంలో ఎల్.గౌతం కృష్ణారెడ్డి, 63 కేజీల విభాగంలో వి.హరిచరణ్ తేజ్ బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే ఈ నెల 4, 5 తేదీల్లో రైల్వే కోడూరులో జరిగిన స్కూల్‌గేమ్స్ అండర్–19 పోటీల్లో 68 కేజీల విభాగంలో ఎం.లిఖిత్‌కుమార్ బంగారు పతకం, నివాస్ సిల్వర్ మెడల్ సాధించారు. 68వ స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి పోటీలు నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరగనున్నాయి.

ముగిసిన జిల్లా స్థాయి బాలబాలికల చెస్ టోర్నీ

అనంతపురం: జిల్లా అండర్–15 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్–2024 టోర్నీ బుధవారం ముగిసింది. అండర్–15 ఓపెన్ విభాగంలో ఎ.సాయియశస్వి మొదటి స్థానం, పి. సంజయ్ సాహుల్ రెండో స్థానం, అండర్–15 బాలికల విభాగంలో ఛాంపియన్‌గా ఎ.సుకృత నిలిచారు. రెండో స్థానాన్ని షారోన్ బ్లెస్సీ దక్కించుకుంది. రెండు విభాగాల్లోనూ తొలి నాలుగు స్థానాలు దక్కించుకున్న వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ గుంటూరు వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి.